# 6. ఘన విజయం

పాటియాలా మహారాజా యాదవేంద్ర సింహజీ వారు సకల విద్యలూ సశాస్త్రోక్తంగా అభ్యసించారు. అందులో ముఖ్యమైనది యుద్ధ విద్య.

తానో మహా మేధావిననీ, వీరుణ్ణనీ, శూరుణ్ణనీ మహారాజావారికి చాలా చాలా నమ్మకముండేది.

కానీ...

తన పరాక్రమాన్నీ, యుద్ధవిద్యా ప్రావీణ్యాన్నీ ప్రదర్శించి పదుగురను చకితుల్ని చేసి పారేసే మహాదవకాశం మాత్రం ఏనాటికీ ఎదురవ లేదు మహారాజావారికి,

ఎందుకంటే...

రాజాల్తోనూ, మహారాజాల్తోనూ చేయాల్సిన యుద్ధాలన్నీ బ్రిటిష్ వాళ్లే చేసేస్తున్నారు. అంతేకాదు. వాళ్ళసలు యుద్ధాల్తో పనిలేకుండానే సంస్థానాలకు సంస్థానాలనే మ్రింగేస్తున్నారు కూడా.

ఇలాంటి స్థితిలో సదా అంతఃపుర శృంగార జీవితంలోనూ, అరణ్యాలలో వేటల్తోనూ విసుగెత్తి పోతూండగా....

ఓ సుప్రభాతాన మహారాజావారి మస్తిష్కంలో ఏమంత అపూర్వం గాని ఆలోచన ఒకటి మెరుపులా తట్టింది.

అదేమంటే...

అడవుల్లో కూర్చుని జంతువులను వేటాట్టం ఏమంత ఘనకార్యం కాదు....

కనుక...

వేటాడితే యుద్ధరంగంలో శత్రువులను వేటాడాలి.

అంటే...

యుద్ధం అంటూ ఏదీ మనముందు లేనప్పుడు మనమే దాన్ని పిలకబట్టి లాక్కురావాలి.

ఈ ఆలోచన తట్టగానే మహారాజావారు తక్షణం సేనానుల్నీ, మంత్రుల్నీ సమావేశపరచి తన అమూల్య సిద్ధాంతాన్ని వారికి నూరి పోశారు.

బ్రిటిష్‌వారి ప్రతిభ ఆనాడు అప్రతిహతంగా వెలిగిపోతోంది. ఏ మాత్రం సందు దొరికినా వా రందులోంచి కోటల్లోకి దూరి, పాగావేసి, ఆ మీదట యూనియన్ జాక్‌ను ఎగరేసి తీరిగ్గా పెత్తనం చలాయిస్తున్నారు.

మహారాజా యాదవేంద్ర సింహజీ వారి పాటియాలా సంస్థాన సరిహద్దుల్నిండా అలాంటి బ్రిటిష్ ప్రాంతాలనేకం ఉన్నాయి.

వాటిపై దండయాత్రలు చేసి వాటిని పాటియాలా సంస్థానంలో కలిపేసుకోవటం కన్నా వీరోచిత ఘనకార్యమూ, దేశభక్తి వగైరా మరే ముందని శ్రీవారు సభాసదుల్ని ప్రశ్నించారు.

సమాధానంగా సేనానుల్లో కొందరు అంగీకారంగా, మరికొందరు అనంగీకారంగా, మరికొందరు మౌనంగా తల లూగించారే గానీ ఎవరు కూడా నోరు మాత్రం మెదపలేదు.

మహామంత్రి మాత్రం ఈ ఆలోచనను ఖండించారు. అది ఆత్మ హత్యా సదృశమని సెలవిచ్చారు. అపార బలగం ఉన్న బ్రిటిష్‌వారిని

తమ చిన్న సైన్యంతో తలపడటం, ఓడించటం అసంభవమనీ, పైగా అలాంటి యుద్ధమే గనుక ఎదురైతే మహారాజావారు ఇప్పుడున్న యీ సింహాసనాన్ని సైతం పోగొట్టుకోవాల్సి వస్తుందనీ నిర్భయంగా వ్రాకుచ్చారు.

దానితో మహారాజావారు కాస్త శాతించారు. కానీ వారిలోని వీరత్వం రెచ్చగొడుతున్న యుద్ధ పిపాస మాత్రం అణగలేదు.

అందువల్ల...

సైన్యాన్నంతా సమాయత్తం చేసి బ్రిటిష్ వారితో యుద్ధానికి రిహార్సల్స్ జరిపించ వలసిందిగా ఆదేశించి, ఆ రాత్రికి రాణివాసంలో సుఖంగా విశ్రమించేరు.

మహారాజావారి ఆదేశం ప్రకారం సేనలన్నీ సరిహద్దుల్లోనున్న హిమాలయ సానువుల్లోని పింజోర్ ప్రాంతంలో కేంద్రీకరింపబడినాయి.

ఓ భాగం పాటియాలా సంస్థాన సైన్యంగా గుర్తింపబడింది. దానికి సంస్థాన సర్వసేనాపతి జనరల్ హరికా సర్వాధికారిగా నియమింపబడ్డాడు.

మరోభాగం "బ్రిటిష్" సైన్యంగా గుర్తించ బడింది దానికి మహారాజావారి అంగరక్షక దళాధికారి కర్నల్ అబ్దుల్ హమీద్‌ఖాన్ "కమాండర్ ఇన్ - ఛీఫ్"గా నియమింప బడ్డాడు.

ఈ ఖాన్‌గారు బట్టతలతో అచ్చు ఏడవ జార్జిలాగే ఉండేవాడు. అందువల్ల అతను "బ్రిటిష్" సైన్యానికి కమాండర్ - ఇన్ -ఛీఫ్‌గా అచ్చుగుద్దినట్లుగా సరిపోయేడని అందరూ ఆనందించారు.

ఈ రెండు "శత్రు" సైన్యాలూ రిహార్సల్స్ పూర్తికాగానే ఓ సుదినాన మహారాజావారూ, వారి రాణివాసమూ, ఉద్యోగులూ, ప్రముఖులూ

అందరూ తిలకిస్తూండగా బహిరంగంగా తలపడి "చరిత్రాత్మకంగా" పోరాడాయి.

ఆ అపూర్వ సమరంలో "బ్రిటిష్" సేనలు యథావిధిని శాస్త్రోక్తంగా ఓడిపోయాయి.

"బ్రిటిష్" సేనానులూ, "బ్రిటిష్ కమాండర్ - ఇన్ - ఛీఫ్" అబ్దుల్ హమీద్ ఖాన్ సాహెబూ అందరూ యుద్ధ ఖైదీలుగా దొరికిపోయారు. ఖాన్‌సాహెబ్‌గారి "బ్రిటిష్ హెడ్ క్వార్టర్స్" మీది యూనియన్ జాక్ పీకి మహారాజావారి పతాకాన్ని ప్రతిష్ఠించారు.

ఏడవ జార్జి చిత్రం ఉన్న బ్రిటిష్ నాణాలను నేలవేసి, కాలరాసి ఆనందించేరు మహారాజావారూ వారి సేనానులూ.

విజయోత్సవాలూ, విందులూ, సురాపానాలూ అన్నీ అయాక మహారాజావారూ, వారి ముఖ్య అనుచరులూ అంతా కలసి "బ్రిటిష్ కమాండర్ - ఇన్ - ఛీఫ్"గా అమోఘంగా నటించిన ఖాన్‌సాహెబ్‌గారిని పట్టుకున్నారు.

పట్టుకుని...

ఏడవ జార్జిలా అచ్చుగుద్దినట్టున్న అతని బట్టతలమీద తిట్లతోపాటు పాదరక్షల్ని కూడా ప్రయోగించి ఆనందించారు.

ఆ విధంగా మహారాజా యాదవేంద్రసింహజీ వారు ఒక్క సైనికుడినయినా చంపకుండా, తానూ నష్టపడకుండా "బ్రిటిష్" వారిపై చరిత్రాత్మకమైన ఘన విజయాన్ని సాధించడమే గాకుండా మహాఘనత వహించిన "ఏడవ జార్జి"ని కూడా స్వయంగా పాదరక్షా ప్రయోగం చేసి మరీ అవమానించ గలిగేరు.

ఆ మర్నాడు ఖాన్‌సాహెబ్‌గారు తిరిగి తన పూర్వపు ఉద్యోగంలో -మహారాజావారి అంగరక్షక దళంలో – చేరిపోయాడు. అన్ని అవమానా లనూ ఓపికగా సహించినందుకూ, యుద్ధంలో బహు నేర్పుగా ఓడిపోయి నందుకూ విలువైన బహుమతులతో సత్కరింప బడ్డాడు.

మహారాజా యాదవేంద్రసింహాజీ వారంతటితో తృప్తి పడి పోయేరు; ఆ చరిత్రాత్మక ఘనవిజయం తర్వాత వా రెన్నడూ బ్రిటిష్ వారిని కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.

★